ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 18

శిరిడీలో ఉత్సవాలు

పల్లకీ - చావడి ఉత్సవము : ఒకరోజు పెద్ద వర్షమొచ్చి, మశీదంతా తడిసిపోయి, బాబాకు కూర్చునేందుకు చోటుగూడ లేకపోయింది. భక్తు లాయనను నాటి రాత్రికి చావడిలో వుండమన్నారు. ఆయన అంగీకరించకపోయేసరికి పట్టుబట్టి ఆయనను అక్కడికి తీసుకుపోయారు. ఆ రాత్రి ఆయన అక్కడ విశ్రమించారు. నాటినుండి ఆయన ఒక రాత్రి మశీదులోను, ఒకరాత్రి చావడిలోనూ నిద్రించేవారు. వారిని భక్తులు మశీదునుండి చావడికి వేడుకలతో తీసుకెళ్ళడం క్రమంగా డిసెంబరు 10, 1909 నాటికి అది గొప్ప చావడి ఉత్సవంగా రూపొందింది. నేటికీ యిది గురువారం రాత్రి పల్లకి ఉత్సవంగా జరుగుతున్నది.

ఒకప్పుడు హార్దానుండి భక్తులు బాబాకొక పల్లకీ పార్సెల్ చేసి పంపారు. బాబా దానిని మశీదు ముంగిట పెట్టించి, మూడు మాసాలు దానిని తెరవనివ్వలేదు. ఒకరోజు రఘువీర్ పురందరే చనువుగా, "బాబా, ఈరోజు పల్లకీ బయటకు తీసి పూలతో అలంకరించి అందులో మిమ్మల్ని చావడికి తీసుకుపోతాం" అన్నాడు. సాయి ఆ పార్సిలు విప్పడానికే ఒప్పుకోలేదు. అయినా అతడు పంతంగా విప్పుతుంటే బాబా గద్దించి పట్టరాని కోపంతో సటకా తీసుకుని, చంపేస్తానని అతనిమీదకు పరుగెత్తారు. భక్తులు భయంతో పారిపోయారు. పురందరే అదేమీ పట్టించుకోకుండా నెమ్మదిగా పార్సిలు విప్పి, పల్లకీని పూలతో అలంకరించాడు. ఇక బాబా మౌనంగా వుండి పోయారు. అది చూచిన పురందరే పంతంగా, 'ఇకనుంచి మిమ్మల్ని పల్లకీలో ఊరేగింపుతో చావడికి తీసుకెళ్తాము!' అన్నాడు. "అలామాత్రమెన్నటికీ జరుగనివ్వను" అన్నారు బాబా. అతడు, "అయితే పల్లకీ ఖాళీగా మోసుకుపోతామా ఏమి?" అన్నాడు. సాయి ఉగ్రులై, "నీవు ముందు బయటికి పోతావా, లేదా?" అని చెడ్డగా తిడుతూ సటకాతో బెదిరించారు. అతడు త్వరగా ఆ పని పూర్తిచేసి స్వగ్రామం వెళ్ళిపోయాడు. అతడనుమతి కోరినపుడు బాబా ఏమీ మాట్లాడకుండా 'ఊధీ' యిచ్చారు. తర్వాత చావడికి వెళ్ళవలసినరోజు సాయంత్రమయ్యేసరికి భక్తులందరూ మొట్టమొదటి పల్లకీ ఉత్సవానికి మశీదువద్ద చేరారు. బాబా మాత్రం పల్లకీ ఎక్కనని భీష్మించారు. ఊరినుంచి అప్పుడే వచ్చిన పురందరే తాను సిద్ధంచేసిన పల్లకీ లేకుంటే తాను ఉత్సవానికి రానన్నాడు. భక్తులెంత బ్రతిమాలినా బాబా తమ పట్టు విడువలేదు. చివరకు పల్లకీలో వారి పాదుకలు వూరేగించాలని, సాయి పాదచారియై వూరేగింపుతో వెళ్ళాలనీ రాజీ కుదిరింది. "బాబా, పల్లకీ నేను కూడా మోసేదా?" అన్నాడు పురందరే. "వద్దు, నీవు 125 వత్తుల దివిటీ పట్టుకో!" అన్నారు బాబా. అలా దివిటీల ఊరేగింపుతో పల్లకీ చావడి చేరింది.

నాటి ఉత్సవమయ్యాక సాయి పల్లకీని మశీదులో పెట్టనివ్వలేదు. గనుక 3,4 రోజులు అది చావడిలోనే వున్నది. చివరికెలాగో ఒకరాత్రి మాత్రం మశీదు ముంగిట వుంచనిచ్చారు. ఆ రాత్రి దానికున్న రెండు వెండి సింహాలూ దొంగలెత్తుకెళ్ళారు. కనుక దానికొక షెడ్డును నిర్మించనారంభించాడు పురందరే. బాబా లెండీనుండి గబగబా వచ్చి "ఏమిటి చేస్తున్నావ్?" అని గద్దిస్తే అతడు నవ్వుతూ చెప్పాడు. ఆయన ఉగ్రులై, "నువ్విక్కడనుంచి పోతావా, లేక నీ తల పగలగొట్టనా?" అని మీదకెళ్ళారు. అతడాయన కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలాడు. ఆయన

మరింత గట్టిగా, 'నాకు నువ్వూ వద్దు, పల్లకీ, షెడ్డు అసలేవద్దు; నన్ను విసిగించకు, ఫో!" అని అరచారుగాని, అతడు చేస్తున్న పనిలో మాత్రం జోక్యం చేసుకోలేదు.

మధ్యాహ్నం ఆరతయ్యాక భక్తులందరూ భోజనాలు చేసి తిరిగి మశీదు చేరినా పురందరే మాత్రం వెళ్ళకుండా పనిచేస్తూనే వున్నాడు. సాయి కొన్నిసార్లు అతనికి నెమ్మదిగా చెప్పారు. మందలించారు, గద్దించారు; భోజనానికి వెళ్ళకుంటే కొడతానని బెదిరించారు. అయినా అతడు వినిపించుకోలేదు. పట్టరాని కోపంతో పలుకకుండా పదేపదే అతనికేసి చూస్తారు; చేత్తో పొట్ట తడుముకుంటారు. "ఆ పనికిమాలినవాడు భోజనానికిగూడ పోకుండా నా ప్రాణం తీస్తున్నాడు. నువ్వైనా పిలుచుకుపో!" అని కాకా సాహెబ్‌తో చెప్పారు. "అతడు సెలవుపెట్టాడు. అదయ్యేలోగా పని పూర్తిచేయాలని చూస్తున్నాడు. అతనిని భోజనానికి పిలుచుకెళ్ళనా?" అన్నాడు కాకా. "వాడు రాడు, ఆ మూర్ఖుడు నేను చెప్పినా వినలేదు!" అన్నారాయన. వెంటనే పురందరే వారి పాదాలపైబడి పసిపిల్లవానిలా ఏడుస్తుంటే, "ఎందుకేడుస్తావ్? వూరుకో!" అన్నారు బాబా. అతడు కళ్ళు తుడుచుకొని, "ప్రొద్దుటినుండీ నన్నింతలా తిడుతున్నారు; కొడతాను, చంపుతాను అని బెదిరిస్తున్నారు. కాని నేనొక్కపూట భోంచేయకపోతే అంత తల్లడిల్లిపోతున్నారే! నాపై మీకెందుకింత దయ? మమ్మింతలా పట్టించుకునేదెవరు?" అన్నాడు. "నోర్మూయ్! వెళ్ళి భోజనం చెయ్యి; కడుపు మండిపోతుంది!" అన్నారు బాబా. అతడు రెండడుగులు వేసి చటుక్కున వెనక్కు తిరిగి, "నేను వెళితే మీరిదంతా పీకేస్తారు!" అన్నాడు. బాబా ప్రసన్నులై, 'నేనేమన్నా రాక్షసుడనా? నేనలా ఏమీ చేయనులే!' అన్నారు.

అతడు భోంచేసి వచ్చి సాయంత్రానికల్లా ఆ షెడ్డుకొక తలుపు బిగించాడు. అపుడు పల్లకీ ఆ గదిలో పెట్టి, సాయికి నమస్కరించి, "బాబా, సెలవయిపోయింది, నేను వెళ్ళాలి. ఇంకా ఒక్క తలుపు బిగించాలి. ఆ పని తాత్యాకు అప్పగించి వెడతాను" అన్నాడు. " ఆ పని రేపాలోచిస్తాములే. నీవుపోయి విశ్రాంతి తీసుకో!" అన్నారు బాబా. తెల్లవారగానే అతడు మళ్ళీ సాయిని సెలవు కోరాడు. "అక్కడికి వెళ్ళి ఏం చేస్తావు? మనం ప్రారంభించిన పని పూర్తిచేయాలి గాని యింకొకరికప్పగించకూడదు. వీలైనంత తరచుగా శిరిడీ వస్తుండాలి" అన్నారు బాబా. "మీరు సంకల్పిస్తేనే రాగలం" అన్నాడు పురందరే. "శిరిడీకి నేనందరినీ పిలుస్తాను. కాని రావడానికందరూ సిద్ధంగా వుండరు. పని పూర్తిచేసి, కాకడ ఆరతయ్యాక వెళ్ళు" అన్నారు. పురందరే మర్నాడు వెళ్ళాడు. అప్పటినుండి 'చావడి ఉత్సవం' 'పల్లకి ఉత్సవం'గా మారింది.

ఆ ఉత్సవానికి ముందే భక్తులంతా మశీదు ముంగిట చేరి తాళాలు చిడతలు మొ॥న వాద్యాలతో భజన చేసేవారు. ఇంతలో అబ్దుల్లా, రాధాకృష్ణ ఆయి-యిద్దరూ బాబా తిరిగే వీధులన్నీ శుభ్రంచేసి, నీళ్ళు చల్లి, ముగ్గులేసి, మశీదునుంచి చావడిదాకా బాటమీద గుడ్డలు పరిచేవారు. వెనుక చిన్న రథము, కుడివైపున తులసికోట, ఎదుట సాయి, మధ్యలో భక్తబృందమూ వుండేవారు. కొందరు మసీదు గేటువద్ద దివిటీలు సిద్ధం చేస్తుంటే, కొందరు పల్లకీనలంకరించేవారు. కొందరు దండాలు ధరించి, "సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై" అని కేకలేస్తుండేవారు. మశీదంతా దీపాలతోను, తోరణాలతోనూ కళకళలాడుతుండేది. దాని ఎదుట ముంగిట్లో చక్కగా అలంకరించిన శ్యామకర్ణ (గుఱ్ఱం) నిలబడేది. అపుడు తాత్యా వచ్చి బాబాను సిద్ధంగా వుండమని చెప్పేవాడు. తర్వాత అతడు సమయానికొచ్చి చంకలో చెయ్యివేసి సాయిని లేవదీసాక అప్పుడు సాయి నెమ్మదిగా నిలబడి తమ చంకలో సట్కా, చేతిలో చిలుముగొట్టం, పొగాకూ తీసుకుని, భుజానికొక పాతగుడ్డ వేసుకునేవారు. ఆయన అడుగు ముందుకు వేసే సమయానికి తాత్యా ఒక బంగారు జరీశాలువా ఆయన భుజాలపై కప్పేవాడు. అప్పుడాయన అడుగు ముందుకువేసి, కుడికాలుతో ధునిలో కట్టెలు సర్ది, కుడిచేతితో అక్కడున్న దీపమార్పి బయల్దేరేవారు.

వెంటనే భక్తులెంతో ఉత్సాహంగా మేళతాళాలు మ్రోగించేవారు. వివిధ కాంతులు చిమ్మే టపాసులు పేలుస్తూ మేళతాళాలతో అందరూ ముందుకు సాగేవారు. కొందరావేశంతో నృత్యం చేసేవారు. కొందరు జండాలు, ధ్వజాలు మోసేవారు. సాయి మశీదు మెట్లమీదకు రాగానే వందిమాగధులు ఎలుగెత్తి జై కొట్టేవారు. భక్తులు చామరాలతో వీస్తూ బాబాను ముందుకు నడిపించేవారు. తాత్యా ఒక చేత్తో లాంతరు, మరొక చేత్తో బాబా ఎడమచెయ్యి పట్టుకునేవాడు; కుడిచెయ్యి మహల్సాపతి పట్టుకుని, తర్వాత విడిచి సాయి దుస్తుల అంచులు పట్టుకుని నడిచేవాడు. జోగ్ ఆయనకు ఛత్రం పట్టేవాడు. ఆయన ముందు శ్యామకర్ణ, వెనుక భక్తులు, సేవకులు, వాద్యగాళ్ళు నడిచేవారు. నామసంకీర్తనం, వాద్యాలు, జయకారాలు మిన్నుముడుతుంటే, ఊరేగింపు నెమ్మదిగా మశీదు మలుపు చేరేది.

అక్కడ సాయి చావడివైపు తిరిగి నిలిచినప్పుడు, ఆయన రూపం దివ్యంగా వుండేది. ఆయన ఏకాగ్ర మనస్కులై ఎవరినో మనస్సుతో పిలుస్తున్నట్లు కన్పించేవారు. తమ కుడిచెయ్యి క్రిందికి, పైకీ వూపి వింతైన భంగిమలు చేసేవారు. కాకాసాహెబు వెండి పళ్ళెంలో గులాల్ పూసిన పూలు తెచ్చి ఆయనపై చల్లుతుండేవాడు. అపుడు వాద్యఘోష ఆకాశాన్నంటేది. 'అప్పుడు బాబా ముఖంలో వుట్టిపడే దివ్యకళను మించినదేదీ వుండజాలదు' అన్నాడు ప్రధాన్. దానిని స్వయంగా చూచిన హేమాడ్‌పంత్, 'ఆ దృశ్యము, దాని వైభవము వర్ణించ సాధ్యంగాదు' అని వ్రాశాడు. ఒక్కొక్కప్పుడు మహల్సాపతి దివ్యమైన ఆవేశంతో నృత్యం చేసేవాడు. అయితే ఏకాగ్రమైన సాయిదృష్టిని యివేవీ కించిత్తు గూడా ఆకర్షించలేకపోయేవి. దివ్యమైన ఆ ఉత్సవాన్ని చూడడానికి ఎందరెందరో గుమిగూడేవారు. సాయి చాల నెమ్మదిగా నడిచేవారు. అలా ఊరేగింపు చావడి చేరేది. "ఆ రోజులు గడిచిపోయాయి. ఇపుడు గాని, యిక ముందుగాని అలాటి ఉత్సవమెవరూ చూడలేరు. అయినా దానిని స్మరించి మనం కొంతవరకూ తృప్తి పొందవచ్చు" అంటాడు హేమాడ్‌పంత్.

అంతకుముందే చావడి కప్పును తెల్లగుడ్డతో అలంకరించేవారు. చుట్టూ రంగు రంగుల దీపాలు, అద్దాలు అమర్చేవారు. ముందుగా తాత్యా వెళ్ళి బాబాకు ఆసనము, ఆనుకోవడానికి చెక్క అమర్చి, సాయిని కూర్చోబెట్టి, అందమైన కోటు తొడిగేవాడు. భక్తులు చక్కని కుచ్చు కిరీటము, పూలమాలలు, ఆభరణాలతో ఆయననలంకరించి, వారి నుదుట కస్తూరి చందనాలతో నిలువుగీతలు గీసి, చుక్కపెట్టి, బాబాను తనివితీరా చూచి ఆనందించేవారు. ఆయన ఏ క్షణాన కోపమొచ్చి వాటిని పారేస్తారోనన్న భయంతో కొందరు తాము తెచ్చిన తలగుడ్డలు, కిరీటము ఆయన తలపై పెట్టక ఆ పైగా పట్టుకునేవారు. సాయి ప్రేమతో వారి భావానికి తలవొగ్గేవారు. ఆ అలంకారంతో ఆయనెంతో అందంగా వుండేవారు. అపుడు నిమోన్కర్ బాబాకు ఛత్రం పట్టేవాడు. భక్తులొకవంక చామరాలతో వీస్తుంటే, శ్యామా చిలింలో నిప్పేసి తాత్యాకిచ్చేవాడు. అతడది రాజుకునేలా చేసి సాయికిచ్చేవాడు. ఆయన పొగపీల్చి మహల్సాపతికి, మిగిలిన భక్తులకూ అందించేవారు. ఆ చిలిం గురించి హేమాడ్‌పంత్ యిలా వ్రాశాడు: "అచేతనమైన ఆ చిలిం ధన్యమైంది. మొదట అదెంతో కఠోర తపస్సు చేసింది. కుమ్మరి దానిని మట్టిగా కాళ్ళక్రింద త్రొక్కి, గొట్టంచేసి, ఎండబెడతాడు. తర్వాత నిప్పుల్లో కాలుస్తాడు. అప్పుడే దానికి సాయి స్పర్శ, పెదవుల స్పర్శ లభించేది."

ఇలాంటి సందర్భాలలోగూడ సాయిలో ఒక్కొక్కప్పుడు కోపావేశం తొంగిచూచేది. ఫిబ్రవరి 26, 1912న చావడి ఉత్సవానికి మసీదుపై దీపాలు పెట్టడానికి పైకెక్కినవాళ్ళను ఆయన తిట్టారు. ఊరేగింపు బయల్దేరగానే శ్రీమతి జోగ్‌పై సట్కా విసిరారు. చావడిలో ఆరతి కాగానే కోపంతో జోగ్ చేతులు పట్టుకుని, 'అరతెందుకిచ్చావ్?' అని గద్దించారు. బాలషింపీ, త్రయంబక్‌లు అవి ఆశీస్సులని తలచి సాయికి సాష్టాంగ నమస్కారం చేశారు.

ఉత్సవమయ్యాక భక్తులు సాయిమెడలో మాలలు వేసి, ఆయనకు పూలగుత్తులు సమర్పించేవారు. చివరకు

జోగ్ మంగళవాద్యాలతో, శేజారతి చేశాక, ఒక్కొక్కరే సాయివద్ద సెలవు తీసుకొని యిళ్ళకు వెళ్ళేవారు. అపుడు బాబా ప్రేమగా, "నన్ను కనిపెట్టివుండు, రాత్రివచ్చి, నన్ను విచారించి వెళ్ళు' అని తాత్యాతో అనేవారు. అందరూ వెళ్ళాక భక్తులిచ్చిన గుడ్డలు స్వయంగా పరచుకుని సాయి విశ్రమించేవారు.

రోజు విడిచి రోజు సాయి చావడిలో నిద్రించనారంభించాక, భక్తులు దానికి తగిన మార్పులు చేసారు. అన్నాచించినీకర్ దంపతులెంతోకాలం శిరిడీలో వుండి బాబాను సేవించారు. అతనికి 50 సం॥లు దాటినా సంతానం కలుగలేదు. ఒకనాడు శ్యామా, "బాబా! నీవెందరి కోరికలో తీరుస్తున్నావుగాని, వీరింతగా సేవిస్తున్నా ఒక్క బిడ్డను గూడ ప్రసాదించవేమి?' అన్నాడు. ఆయన నవ్వి, "నన్ను నిజంగా కోరితే ఎప్పుడైనా తీర్చకుండా వున్నానా? ఏమి తెలియనివాడిలా మాట్లాడతావేం? వీరేమీ అడగలేదు. వీరికి కొడుకును ప్రసాదించినా ఒక్క తరంకంటే వీరి వంశం నిలవదు. అంత కంటె కలకాలం కొనసాగే వంశప్రతిష్ట ప్రసాదిస్తాను" అన్నారు. ఆయన భావమెవరికీ అర్థంకాలేదు. అప్పట్లో అన్నాకొక కోర్టు వ్యాజ్యం 3 సం॥లు నడిచింది. దానిని గురించి ఎప్పుడడిగినా, "అల్లాహ మేలు చేస్తాడు" అనేవారు సాయి. ఒకరోజు అతడు వ్యాజ్యంలో ఓడిపోయినట్లు ఎవరో జాబు వ్రాశారు. అది తీసుకొని దీక్షిత్, అన్నా కోపంతో మశీదు చేరగానే సాయి ఉగ్రులై, "ఈ ముసలాడికి నా మీద నమ్మకం లేదు, ఆ ఉత్తరం అవతల పారేయండి!" అని కసిరారు. కొద్ది నెలల తర్వాత కోర్టువారు అన్నాకు అనుకూలంగా రూ.1800/-లకు డిక్రీ చేశారు. ఆ భక్తులిద్దరూ సంతోషంతో బాబావద్దకొచ్చి, ఆ పైకమంతా దక్షిణగా వారినే తీసుకోమన్నారు. ఆయన నవ్వి, "అది నేనేం చేసుకుంటాను? నాకు యిల్లా, కుటుంబమా? నీవే తీసుకో!" అన్నారు. చివరకు సాయికి ఆశ్రయమైన చావడి మరమ్మత్తుకు ఆ పైకం వినియోగించారు. అందుకే అక్కడ, "లక్ష్మీబాయి దామోదర్ బాబరే" అని ఆ దంపతుల పేర్లుంచారు.

నిత్య ఆరతులు : ప్రతిరోజూ ఉదయం 5 గం॥ల ప్రాంతంలో భక్తు లందరూ ఛత్రచామరాలు, దండాలూ తీసుకుని ఆరతికి మశీదు చేరేవారు. ఒకరు బాబా ప్రక్కన నిలచి ఛత్రం పడితే, ఒకరు చామరంతో వీస్తుండేవారు. అప్పుడు మేఘుడు అంతా సిద్ధంచేసి బాబాకు ఆరతిచ్చేవాడు. వెంటనే భక్తులందరూ, "శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై!" అని ఎలుగెత్తి చాటి, తాళాలు, చేతులు తడుతూ ఆరతి పాడేవారు. ఆరతి తమ యెదుట తిరగకుండా ఛత్రచామరాలు పట్టినవారు దూరంగా వొదిగి నిలచేవారు. తర్వాత ఒక్కొక్కరే సాయికి నమస్కరించి, ఊదీ తీసుకుని, కాలకృత్యాలకెళ్ళేవారు, కొద్దిమంది బాబా సన్నిధిలో కూర్చునేవారు. ఇలా రోజుకు నాల్గు ఆరతులు జరిగేవి. మేఘుడు జీవించివున్నంత కాలం అతడే ఆరతిచ్చేవాడు. తర్వాత బాపూసాహెబ్ జోగ్ ఆ కార్యక్రమాన్ని స్వీకరించాడు. ఇవి నేటికీ యిలానే జరుగుతున్నాయి.

లెండీ యాత్ర : రోజూ ఉదయం 8-30 ప్రాంతంలో సాయి లెండీకి వెళ్ళి వచ్చేవారు. అప్పుడు మొదట మశీదు ముంగిట వాద్యగాళ్ళుచేరి మేళం వాయించేవారు. టోపీ, దండం ప్రత్యేక దుస్తులు ధరించిన యిద్దరు సేవకులు మశీదు మెట్లవద్ద నిలచేవారు. వారందరితో కలిసి సాయి బైటకొచ్చి, మశీదు మలుపులో మారుతి ఎదుటికొచ్చి, అటువైపుకు కుడిచేత్తో చిత్రమైన సైగలు చేసేవారు. తర్వాత నాల్గు దిక్కులవైపూ తిరిగి తీక్షణంగా చూస్తూ అవే సైగలు చేసేవారు. తర్వాత గురుస్థానం దగ్గరనున్న వీధుల కూడలిలో నిలిచి, అచటి వేపచెట్టు వైపుకు చూస్తూ తమ గురుస్థానానికి శ్రద్ధాంజలి చెప్పుకుంటున్నట్లు సైగలు చేసేవారు. తరువాత మిగిలిన మూడు దిక్కుల వైపుకూ అలానే సైగలు చేసేవారు వాడాలోనివారు, అప్పుడే శిరిడీచేరిన భక్తులు వారిని అక్కడ దర్శించి నమస్కరించుకునేవారు. తర్వాత ఆయన దక్షిణంగా వున్న వీధుల కూడలిలో నిలిచి సైగలు చేసేవారు. ఇప్పుడక్కడ గుర్తుగా గూటిలో సాయి పాదుకలు ప్రతిష్టించారు. అక్కడ పిలాజీ గురవ్ యిల్లు మాత్రమే వుండేది! అక్కడనుండి

లెండీ కన్పించేది. ఒకరోజు ఆ సమయంలో లెండీలోని ఒక చెట్టును ప్రభుత్వ కూలీలు నరుకుతున్నారు. అదిచూచి గురవ్ కుమారునితో సాయి,"ఆ చెట్టు నరకవద్దని చెప్పు, దానికీ ప్రాణముంటుంది!"అన్నారు. ఆ యువకుడు, "వారు మనం చెబితే వింటారా" అన్నాడు. క్షణంలో బాబాకు కోపంవచ్చి, "వెధవా, నీకెంత తెలివి పెరిగిందిరా!" అని అతణ్ణి, ప్రక్కనే చూస్తూ వూరుకున్న బూటీ, జోగ్, ఫస్లేలను గూడ కొట్టారు. కాని మరుక్షణమే శాంతించారు.

తర్వాత ఆయన దక్షిణంగా, యిప్పుడు విఠలుని మందిరమున్న చోట, ఆ యింటి గోడనానుకుని నిలిచేవారు. భక్తులాయనకు మరలా నమస్కరించుకొన్నాక యింకా దక్షిణంగా చౌరాస్తాలో నిలిచి అన్ని దిక్కులవైపు సైగలు చేసేవారు. అక్కడనుండి పడమరగా యిప్పుడు కానిఫ్‌నాథ్ మందిరమున్నచోట రహదారి ప్రక్కనే నిలిచి, మొదట ఖండోబావైపు, తరువాత మిగిలిన దిక్కులవైపూ తిరిగి సైగలు చేసేవారు. అక్కడినుండి ఉత్తరంగా రహదారి ప్రక్కనే నడిచి లెండీకి చేరేవారు. అందులోకి దక్షిణంగా వుండిన చిన్నబాటన సాయి, అబ్దుల్లా లెండీలోకి ప్రవేశించేవారు. మిగిలినవారు తూర్పుగా వున్న బాటవద్ద వేచియుండేవారు. సాయి ఆ తోపులో నిత్యకృత్యాలు తీర్చుకునేవారు. మానవశ్రేయస్సు కోసం **సాయి నిత్యమూ అక్కడ సల్పిన కృషికి ఆ చెట్లు, ఆయన స్థాపించిన శాశ్వతమైన జ్ఞానజ్యోతికి ఆ నందదీపమూ సంకేతాలుగా నిలిచాయి.**

అక్కడ నిత్యకృత్యాలు తీర్చుకున్నాక సాయి, వచ్చినదారినే తిరిగొచ్చే వారు గాని, తూర్పుగా దగ్గరదారిన మశీదుకొచ్చేవారుగాదు. జీవుల శరీరంలో శ్వాస, ప్రకృతిలోని మానవతా ధర్మాలలాగా సాయిగూడ తమ పంథాను ఎన్నడూ మార్చేవారు గాదు. **శిరిడీలో మనం ఎప్పుడు నడచినా, ఆ బాటలోని ప్రతి యిసుకరేణువూ సుమారు 60 సం॥లు సాయి సంచారంతో పవిత్రమైనదని గుర్తుంచుకోవాలి.**

ఉరుసు - శ్రీరామనవమి : శిరిడీలో జరిగే పండుగలన్నింటిలో మతసామరస్యమే సాయి సంకల్పం గనుక శిరిడీలో శ్రీరామనవమి జరపాలని హిందువులకు, ఉరుసు జరపాలని ముస్లిములకూ స్ఫురించింది.

కోపర్గాంవ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా పనిచేసిన గోపాల్రావ్ గుండుకు మూడు వివాహాలు చేసుకున్నా, దామూ అన్నాకు రెండు వివాహాలు చేసుకున్నా బిడ్డలు కలుగలేదు. చివరకు సాయి ఆశీస్సులతో వారికి సంతానం కల్గింది. అందువలన వీరు 1897 లో సాయి సన్నిధిలో ఉరుసు జరపాలనుకున్నారు. కాని ఆ గ్రామాధికారి అడ్డు చెప్పడం వలన ప్రభుత్వం ఒప్పుకోలేదు గాని చివరకు సాయిదయతో అనుమతించింది. నాడు శ్రీరామనవమి గూడ అయింది. ఆ ఉత్సవానికెందరో జనమొస్తారు. ఆ ఊరిలో ఒక బావి ఎండిపోయింది; రెండవ దానిలోనివి ఉప్పునీరు. అప్పుడు బాబా ఆ బావిలో పూలు వేశారు. అప్పటినుంచి అది మంచినీరైంది. ప్రక్క గ్రామాలనుండి గూడ నీరు సరఫరా చేసారు. ఊళ్ళో ఎన్నో దుకాణాలు వెలిశాయి. ఆ ముందురోజు రాధాకృష్ణ ఆయి మశీదు కడిగి, మసిబారిన గోడలు శుభ్రం చేసేది. సాయి మశీదులో వుంటే చేయనివ్వరని, ఆయన చావడికి వెళ్ళిన రాత్రే ఆమె ఆ పనులు చేసేది. ఉరుసుకు దామూ అన్నా, నిమోన్కర్‌లు రెండు జెండాలు, అమీర్ షక్కర్‌దలాల్ చందనము సమర్పించేవారు. ఆ గంధమొక పళ్ళెంలో వుంచి, జెండాలతోపాటు మేళతాళాలతో వూరేగించి, చివరకు ఆ గంధం మశీదులో గోడలమీద చేతులతో అద్దేవారు. జెండాలు మశీదుకు రెండువైపులా కట్టేవారు. ఉత్సవం ఏర్పాట్లన్నీ తాత్యా చూస్తే, భక్తుల అవసరాలు రాధాకృష్ణ ఆయి చూచుకునేది. భారీ ఎత్తున అన్నదానము గూడ ప్రతి సంవత్సరమూ జరిగేది.

భీష్మ అనే భక్తునికి 1911లో శ్రీరామనవమి గూడ జరపాలని తోచి సాయిని కోరితే ఆయన సమ్మతించారు. 'సంఠ్‌వాడ' (శొంఠి -పటిక బెల్లంపొడి) ప్రసాదం రాధాకృష్ణఆయి తయారు చేసేది. మశీదంతా పచ్చని తోరణాలు కట్టారు. రామజననం సందర్భంగా రాధాకృష్ణఆయి మశీదులో ఒక ఊయల కట్టింది. భీష్ముడు కీర్తనకారుడుగా

నిలచాడు. భీష్ముని కీర్తనకంతా సిద్ధమవగానే సాయి, కాకామహాజనితో, "ఏమిటీ హంగామా?" అన్నారు. రామనవమి సంగతి చెప్పగానే నింబారు వద్ద నున్న ఒక పూలమాల హార్మోనియం వాయించనున్న కాకామహాజని మెడలోను, మరొకటి భీష్ముని మెడలోనూ వేయించారు. కీర్తన దిగ్విజయంగా ముగిసింది. భక్తులు తన్మయులై జయకారాలతో, నృత్యగీతాదులతో, గులాబ్ (ఎర్రనిపొడి) పైకెగురవేశారు. అది సాయి కళ్ళల్లో పడడంతో ఆయన ఉగ్రులై అందరినీ తిట్టారు. ఎటువాళ్ళటు పారిపోగా, కొద్దిమంది మాత్రం ఆ తిట్లను ఆశీస్సులుగా స్వీకరించారు. మానవులలోని అరిషడ్వర్గాలనే రాక్షసులను చంపడానికి రాముడవతరించినపుడు సాయి ఆవేశపడడం సహజమే. అంతేకాదు. భక్తులెపుడు క్రొత్తపని ప్రారంభించినా బాబా ఆవేశపడేవారు. అపుడాయన ఊయల విరగ్గొడతారని భయపడి, కాకా మహాజని దానిని విప్పబోయాడు. సాయి శాంతించి, ఉత్సవం పూర్తిగాలేదని చెప్పి వారించారు. నాటి ఆరతి, మరురోజు కీర్తన, గోపాలకళోత్సవాలు గూడ చక్కగా జరిగాయి. ఇలా ఒకేరోజు రామనవమి, పగలు జెండా ఉత్సవము, సాయంత్రం గంధము జరిగాయి. భక్తులు మతభేదాలు మరచి రెండింటిలోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సం॥ 1913 నుండి నవమికి ముందు నామసప్తాహం గూడ ప్రారంభించారు. ఆ సంవత్సరం బాలాబువామాలి, 1914లో బాలాబువా సుతార్‌లు కీర్తన చేసారు. ఆ తర్వాత నుండి సాయి ఆ సేవను దాసగణుకు అప్పగించారు. క్రమంగా ఆ ఉత్సవానికొచ్చే జనుల సంఖ్య కొన్ని సం॥లలో 75 వేల దాకా పెరిగింది. అయినా అంటువ్యాధులు, కలహాలవంటివి ఎన్నడూ జరుగలేదు. దుకాణాలు, సంతర్పణలు, కుస్తీపోటీలవంటి వినోద కాలక్షేపాలు పెరిగిపోయాయి. గుర్రము, పల్లకీ, రథము, వంటపాత్రలు మొ॥వి భక్తులు సమర్పించడంతో సాయి సన్నిధి ఒక సంస్థానంగా రూపుదిద్దుకున్నది. అయినా నేటి విద్యుద్దీపాలకు అతీతంగా వెల్గే నక్షత్ర గ్రహగోళాలలాగా, మహానగరాల సవ్వడి మాటునున్న అతి సామాన్యము, అపారమూ అయిన ఆకాశంలా, యీ వైభవం చాటున సాయి మాత్రం మహత్తరము, అతి నిరాడంబరమూ అయిన జీవితాన్నే కొనసాగిస్తున్నారు.

ఒక రామనవమికి మహానగరాలనుండి కోటీశ్వరులెన్నెన్నో మిఠాయిలు తెచ్చి అర్పించారు. కాని సాయి, "నా భోజనమింకారాలేద"న్నారు. కొంతసేపటికి ఆయన శ్యామాతో, "ఈ జనంలో నెట్టుకురాలేక ఒక ముసలి పేదరాలు రోడ్డుప్రక్కన చెట్టుక్రింద కూర్చున్నది. ఆమెను తీసుకురా!" అన్నారు. తీసుకురాగానే ఆమెతో బాబా, "నాకేమి తెచ్చావు?" అన్నారు. ఆమె ఆ ముందురోజు సాయికోసం జొన్నరొట్టెలు చేసుకొచ్చింది గాని, మశీదులోని విలువైన నైవేద్యాలు చూచి సిగ్గుపడి ఏమీ తేలేదన్నది. కాని సాయి ఆమె దాచిపెట్టుకున్న మూట అడిగి తీసుకుని, "ఇదీ, మన భోజనం!" అంటూ ఎంతో యిష్టంగా తిన్నారు.

గురుపూర్ణిమ : స॥ 1908లో ఒకరోజు పందరినుండి వచ్చిన కృష్ణజీ నూల్కర్ చావడిలో వున్నాడు. బాబా శ్యామాతో, "ఆ ముసలయ్య (నూల్కర్) ను ధునివద్ద స్తంభాన్ని పూజించుకొమ్మని చెప్పు" అని అతడు చెప్పి రాగానే, "మీరంతా గూడా చేసుకోరాదా!" అన్నారు సాయి. 'దేవా! మీకైతే చేస్తాము గాని, స్తంభాన్నెందుకు పూజిస్తాము?' అన్నాడు శ్యామా. మొదట అంగీకరించని బాబా అతడు పట్టుబట్టినమీదట ఒప్పుకున్నారు. ఇంతలో నూల్కర్ పంచాంగం చూస్తే, నాడు (వ్యాస) గురుపూర్ణిమ! తాత్యా, దాదాకేల్కర్, శ్యామా మొ॥న వారు సాయికి ధోవతులిచ్చి పూజించారు. అప్పటినుండి శిరిడీలో గురుపూర్ణిమ చేసుకోవటం ఆచారమైంది. **సాయి నోటిమీదుగా భక్తులకు చేసుకోమని చెప్పిన ఉత్సవమిదొక్కటే!**

అయితే సాయి స్తంభాన్నెందుకు పూజించమన్నారు? భక్తుల శ్రేయస్సుకోరి మాత్రమే, 'గురువును సేవించు' అన్న భావాన్నే సంకేతంగా సాయి చెప్పారు. గురువెన్నడూ "నన్ను పూజించు" అనడు. జ్ఞాని దృష్టిలో అందరూ పరమాత్మ రూపాలే. వారికి శిష్యులెలావుంటారు? తాను గురువునని తలచేవాడు ఆ పేరుకే తగడన్నారు రమణమహర్షి.

అలా అనలేదు గనుకనే సాయి సద్గురుడు. ఇంటికప్పును మోసే ఆధారం స్తంభము. అది నేలలో దృఢంగా నాటుకొని వుంటుంది. అదే దాని బలము. ఆ బలంతోనే అది ఆ భవనాన్నాశ్రయించే వారందరినీ రక్షిస్తుంది. అలానే సద్గురువు సర్వానికీ ఆధారమైన ఆత్మనిష్ఠలో, గురుభక్తిలో నాటుకొని వుంటారు. అంటే గురుభక్తి రూపమైన ఆత్మనిష్ఠవలన గురువు గూడ తమనాశ్రయించినవారిని రక్షిస్తారు -- స్తంభంలాగే! గురురూపాన్ని తగురీతిన కొలవమని సాయి భావం. అంతేగాదు. సాయి శరణానందులతో తాము మశీదులోని స్తంభం క్రిందనున్న గుహలో చాలాకాలం తపస్సు చేసినట్లు సాయి చెప్పారు. చతుర్విధ పురుషార్థాలనూ 'సాధించుకోవడానికి సర్వజీవులకు ఆశ్రయము, అవకాశమూ ('ద్వారక') అయిన యీ జగత్తనే 'ద్వారకామాయి'కి ఆధారమైన మూల స్తంభమే సకల విశ్వరూపుడైన సద్గురువు. అందుకే అట్టి మహనీయుని ఇస్లాంలో "కుతుబ్" ("ధర్మస్తంభము") అంటారు.

'ద్వారకామాయి' యనే శరీరం, మూలాధారం నుండీ సహస్రారం వరకూ వున్న వెన్నెముక (మేరుదండము) అనే స్తంభంమీద ఆధారపడి వుంటుంది. అన్ని ఆధ్యాత్మిక స్థితులనూ తనలో యిముడ్చుకున్న గురువుకది సంకేతం. నిరంతరం గురువును సేవించిన వారికి అప్రయత్నంగా ఆ మార్గం తెరచుకొని, యోగవిద్య సిద్ధిస్తుంది -- సాయికి వారి గురువువలన సిద్ధించినట్లు. అదే సాయి చెప్పినది.

గోపాలరావ్‌గుండ్ ఒకసారి శిధిలమైన మశీదును మరమ్మత్తు చేయించాలని రాళ్ళు తెప్పించి చెక్కించాడు. ఆ తర్వాత పని నానాచందోర్కర్‌కు, నేల చదునుచేసి బండలు పేర్చడం కాకాదీక్షిత్‌కూ అప్పగించారు బాబా. మొదటి శ్రీ సాయి యిందుకు ఒప్పుకోలేదు. మహల్సాపతి ఎలాగో ఒప్పించాడు. సాయి చావడిలో నిద్రించిన రాత్రి, మశీదులో నేల బాగుచేసి ఎత్తయిన పీఠం అమర్చారు. నాటినుండీ సాయి గోనెమీద కూర్చోడం మాని దానిపై కూర్చోనారంభించారు. సం॥ 1914లో భక్తులెంతో శ్రమపడి మశీదు ముంగిట బాగుచేశారు. మొదట అది చాలా చిన్నదిగా వుండి భక్తులకెంతో యిబ్బందిగా వుండేది. దానిని పెద్దదిచేసి పైన కప్పించాలని కాకాదీక్షిత్ పని ప్రారంభించాడు. రాత్రంతా కష్టపడి భక్తులు కమ్ములు నాటారు. ఉదయాన్నే చావడినుండి వచ్చిన సాయి అది చూచి కోపించి, ఆవేశంతో ఇద్దరు ముగ్గురు కలసిగాని నాటనలవిగాని ఆ కమ్మెలను ఒక్కరే పీకి పారేశారు. ఆయన ఒక చేత్తో కమ్మె పెరికివేస్తూ, మరొకచేత్తో సమీపంలోని తాత్యాపాటిల్ గొంతు పట్టుకున్నారు. అతని తలపాగా బలవంతాన లాక్కుని, దానికి నిప్పంటించి, ఆ కమ్మె పాతిన గుంటలో వేశారు. కోపంతో సాయి కన్నులెర్రగా అగ్నికణాలలాగ వెలిగాయి. అందరూ భయభ్రాంతులై చూస్తుండగా శ్రీసాయి తమ జేబులోనుంచి ఒక రూపాయి నాణెం తీసి, భగవదర్పితమన్నట్టు గౌరవంతో ఆ గుంటలో వేశారు. అంతసేపూ ఆయన తాత్యాగొంతు విడచిపెట్టలేదు. తాత్యాభయంతో వణికిపోతున్నాడు. అతనికేమి జరుగనున్నదో ఎవ్వరికీ అంతుపట్టలేదు. జోక్యం చేసుకోవడానికెవ్వరికీ ధైర్యం చాలలేదు. చివరకు ధైర్యంచేసి వారింపచూచిన భాగోజీని బలంగానెట్టి, అతనిమీద యిటుకముక్కలు విసిరారు సాయి. కొంతసేపటికి ఆయన శాంతించి ఒక భక్తుని దుకాణం నుండి జరీతలపాగా తెప్పించి, తాత్యా తలకు చుట్టారు. అదిచూచి భక్తులాశ్చర్యపోయారు. చివరకు మశీదు మరమ్మత్తులన్నీ సక్రమంగా పూర్తయిననాడు సాయి నీమ్‌గాఁవ్ వెళ్ళారు. అక్కడ నుంచి ఆయనను భక్తులు మేళతాళాలతో, ఊరేగింపుతో, పునరుద్ధరించిన మశీదుకు తీసుకొచ్చారు. ఈ కట్టుబడిపని చేసినవారిలో కొండాజీ, గాబాజీ, తుకారాం అనే ముగ్గురు సోదరులు, వడ్రంగి కుటుంబానికి చెందినవారు ప్రధానపాత్ర వహించారు.

★★★